ప్రజాశక్తి
బుధవారం 23 ఆగస్టు 2023
5

అల్లూరి సీతారామరాజు

నేడు ప్రెస్ అకాడమీ ఛైర్మన్ పర్యటన

ప్రజాశక్తి -పాడేరు: సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ నెల 23న జిల్లాలో పర్యటిస్తారు. 23న బుధవారం ఉదయం విశాఖపట్నంలో బయలుదేరి 10.30 గంటలకు పాడేరు చేరుకుంటారు. పాడేరు ఐటిడిఎ సమావేశ మందిరంలో అవర్ స్టేట్ అవర్ లీడర్ మేధావుల సంఘం ఏర్పాటు చేసిన 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్' అంశంపై నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు కాఫీ అతిధి గృహం చేరుకొని రాత్రి బస చేస్తారు.

24న గురువారం ఉదయం 9గంటలకు పాడేరు నుండి బయలుదేరి బొర్రా గుహలు సందర్శిస్తారు.ఒంటి గంటకు అరకు చేరుకొని భోజనానంతరం మధ్యాహ్నం అనంతగిరి చేరుకుని రాత్రి బస చేస్తారు. 25న శుక్రవారంఉదయం 8గంటలకు అనంతగిరిలో బయలుదేరి రాజమహేంద్రవరం చేరుకుంటారు.

రహదారులపై ఇంత నిర్లక్ష్యమా..

- ధ్వంసమై ఏళ్లు గడుస్తున్నా బాగుచేయరా?
- జిల్లా పరిషత్ సమావేశంలో జెడ్‌పిటిసిలు ఆగ్రహం
- సమస్య పరిష్కారానికి చర్యలు : ఉప ముఖ్యమంత్రి బూడి

మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి బూడి, పక్కనే మంత్రి అమర్, జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, జిల్లా కలెక్టర్లు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్
'గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ధ్వంసమై ఏళ్లు గడుస్తున్నా బాగు చేయడం లేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు' అంటూ పలువురు జెడ్‌పిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. మూడు మాసాల తర్వాత జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణతో పాటు మూడు జిల్లాల కలెక్టర్లు డాక్టర్ ఎ.మల్లికార్జున (విశాఖ), రవి పట్టాన్‌శెట్టి (అనకాపల్లి), సుమిత్ కుమార్ (అల్లూరి సీతారామరాజు) పాల్గొన్నారు. సమావేశంలో అనంతగిరి, కొయ్యూరు, పద్మనాభం, బుచ్చయ్యపేట, పాయకరావుపేట, పరవాడ జెడ్‌పిటిసిలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారాయని, సంవత్సరాలు తరబడి వాటికి మరమ్మతులు కూడా చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా వాటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల పాడేరు ప్రాంతంలో బస్సు లోయలో పడిన సంఘటన ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని ఆరోపించారు. బుచ్చయ్యపేట మండలంలో రోడ్ల మరమ్మతు, కొత్తగా రోడ్ల నిర్మాణ సమయంలో రోడ్లకు అడ్డుగా ఉన్న వృక్షాలను తొలగించే సమయంలో సంబంధిత అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆ మండల జెడ్‌పిటిసి దొండా రాంబాబు అన్నారు. అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం కేంద్రంగా కొత్తగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, కెజిహెచ్ మాదిరిగానే నర్సీపట్నం ప్రభుత్వాసుపత్రిలో గిరిజనులకు ప్రత్యేకంగా ట్రైబల్ సెల్ ఏర్పాటు చేయాలని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు కోరారు. అనకాపల్లి ప్రాంతంలో కిడ్నీ సమస్యలు అధికంగా వస్తున్నాయని ఆ ప్రాంత జెడ్‌పిటిసి ఫిర్యాదు చేయగా తక్షణం దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. ఆర్‌బికెలు లేని చోట విత్తనాలు, ఎరువులను రైతులకు అందించే ఏర్పాట్లను ఆయా ప్రాంతాల్లోని పిఎసిఎస్‌లకు అప్పగించాలని కొందరు జెడ్‌పిటిసిలు సూచించారు. గవర కార్పొరేషన్ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కూడా ఇదే ప్రతిపాదన చేశారు. విభిన్న ప్రతిభావంతులకు ఇస్తున్న సదరం సర్టిఫికెట్ల మంజూరులో అక్రమాలు జరుగుతున్నాయని, అనర్హులకు సర్టిఫికెట్లు ఇస్తున్నారని ఒక జెడ్‌పిటిసి ఫిర్యాదు చేయగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ సిఇఒ శ్రీరామమూర్తి, జిల్లా అటవీ శాఖ అధికారి అనంత శంకర్, డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నిస్తున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

చర్చ అంతంతే..

సమావేశంలో అన్ని విభాగాలపై చర్చ జరగాల్సి ఉండగా కేవలం ఆర్ అండ్ బి, వ్యవసాయం, సాగునీరు, వైద్యం అంశాలపై అరకొరగానే చర్చ జరిగింది. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన పలు సందేహాలపై, ఆరోపణలపై ఎటువంటి స్పందనా ఈ సమావేశంలో కనిపించలేదు. అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని పొగుడుతూ మాట్లాడటం మినహా ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విషయాలపై అస్సలు మాట్లాడలేదని పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు. జిల్లాలో తీవ్ర స్థాయిలో వర్షాభావ పరిస్థితి నెలకొన్నా.. దానిపై ఎటువంటి చర్చా లేకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి.

జెడ్‌పి సమావేశంలో పాల్గొన్న సభ్యులు


వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు కార్మికులకు పవర్ జెఎసి ద్రోహం

-ఒప్పందం రిజిస్టర్ కాకుండా నిలుపుదలకు లేబర్ కమిషనర్‌కు లేఖలు

-సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి -సీలేరు
విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల హక్కులకు పవర్ జెఎసి తీవ్రంగా ద్రోహం చేసిందని, ఈ నెల 9న పవర్ జెఎసి, ఎపి ట్రాన్స్‌కో, జెన్‌కో యాజమాన్యంతో చేసిన 2002 వేతన ఒప్పందాన్ని వ్యతిరేకించాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. ఈ వేతన ఒప్పందం రిజిస్టర్ చేయకుండా నిలుపుదల చేయాలని లేబర్ కమిషనర్‌కు ప్రతి ఒక్కరూ లేఖలు రాయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎపి జెన్కో విద్యుత్తు కార్మికులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంటాక్ట్ కార్మికులకు 2018లోనే పవర్ జేఏసీ తీవ్రంగా ద్రోహం చేసిందన్నారు. యాజమాన్యం ప్రయోజనం కోసం పవర్ జేఏసీ భాగస్వామ్య యూనియన్లు ఈ వేతన ఒప్పందం చేశాయని విమర్శించారు. 2018 ఒప్పందం పే స్కేల్‌లోని మినిమ్ బేసిక్‌పై 2శాతం పెంచుతామని ఒప్పందం చేయడానికి కాంట్రాక్ట్ కార్మికులు అంగీకరించలేదని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జికె.వీధి మండల నాయకులు, అమ్మవారి దారకొండ ఎంపిటిసి సభ్యులు అంపురంగి బుజ్జిబాబు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు సుభాన్, అధ్యక్షులు లక్ష్మణ్, విష్ణు కుమార్‌రాజు, వరహాలు, కార్మికులు పాల్గొన్నారు.

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

60 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-మోతుగూడెం
చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్ స్టేషన్ వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో 60 కేజీల గంజాయి పట్టుబడింది. పోలీసుల కథనం ప్రకారం... పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేస్తుండగా, అటుగా వచ్చిన వాహనం తనిఖీ చేయగా అందులో 60 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ గంజాయిని స్వాధీనం చేసుకొని 8 మంది నిందితులను అరెస్టు చేశారు. నిందితులను విచారణ చేపట్టుగా ఈ గంజాయి ఒడిశా రాష్ట్రం నుండి కేరళకు వాహనంలో తరలిస్తున్నట్లు తేలింది. ఈ గంజాయి విలువ రూ.80వేలు ఉంటుంది. నిందితుల వద్ద నుండి 5 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని, వారిని రంపచోడవరం కోర్టుకు తరలించినట్లు ఎస్సై గోపాలరావు తెలిపారు.

ప్రమాదానికి గురైన బస్సు వెలికితీత

లోయలోంచి బయటకు తీస్తున్న బస్సు..

గాయపడిన ఉద్యోగికి డిఎం సపర్యలు

ప్రజాశక్తి–పాడేరు టౌన్: అల్లూరి జిల్లా పాడేరు ఘాట్‌లో ప్రమాదానికి గురై చెట్ల మధ్యలో ఇరుక్కున్న ఆర్‌టిసి బస్సును బయటకు తీశారు. పాడేరు ఘాట్‌లో ఆదివారం సాయంత్రం ఆర్‌టిసి బస్సు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సిబ్బంది, క్రేన్ సహాయంతో మంగళవారం బయటకు తీశారు. ఉదయం 7:30 గంటలకే ప్రమాద స్థలికి చేరుకున్న ఆర్‌టిసి, ఆర్ అండ్‌బి అధికారులు మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు బస్సు వెలికితీత పనులు చేపట్టారు. గోవాడ ప్రాంతం నుంచి ప్రత్యేక బృందంతోపాటు విజయనగరం నుంచి పలు పరికరాలను రప్పించి లోయ మధ్యలో ఉన్న బస్సును బయటకు తీయడానికి సుమారు ఎనిమిది గంటలు శ్రమించారు. చాకచక్యంగా బస్సును రోడ్డుపైకి తెచ్చారు. ఘాట్‌లో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా బస్సు వెలికితీత పనులను ఆర్‌టిసి విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.రవికుమార్, పాడేరు డిపో మేనేజర్ వి.శ్రీనివాస్ దగ్గరుండి పర్యవేక్షించారు. బస్సు వెలికి తీత పనుల్లో ప్రమాదవశాత్తు గాయపడిన పాడేరు డిపోకు చెందిన ఉద్యోగికి స్వయంగా డిపో మేనేజర్ సపర్యలు చేశారు. పాడేరు ఆర్‌టిసి డిపో, ఆర్ అండ్ బి, పోలీసు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ప్రమాద ఘటనపై విచారణ కమిటీ

- ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్

పాడేరు ఘాట్‌లో ఆదివారం సాయంత్రం ప్రమాదానికి గురైన పిటిడి బస్సు ప్రమాద ఘటనపై విచారణ కమిటీ వేస్తున్నట్లు ఆర్‌టిసి విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.రవికుమార్ తెలిపారు. బస్సు ప్రమాద ఘటనకు కారణాలను తెలుసుకుంటున్నామన్నారు. బస్సు ప్రమాద ఘటనను సీరియస్‌గా తీసుకున్నామన్నారు. బాధ్యులపైచర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బోడిరాజు, చిన్నమ్మలతోపాటు మరో ముగ్గురికి ప్రాణాపాయం లేదన్నారు. వీరికి విశాఖలోని మెడికవర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. బస్సు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు.

బొయితిలిలో గడపగడపకూ...

ప్రజాశక్తి – జి.మాడుగుల: మండలంలోని బొయితిలి సచివాలయం పరిధిలోని మద్దిగరవు, దిగరాపల్లి, జాముల వీధి గ్రామాలలో మంగళవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హుల ందరికీ పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు, మద్దిగరువు నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణపనులు శరవేగంగా జరగాలని, నాణ్యత లోపం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఆమె దృష్టికి తేగా, సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బ్రోచర్లను ఇస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

నిబంధనల ప్రకారం భూముల రీ సర్వే

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భుహక్కు భూరక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భూములను నిబంధనల ప్రకారం రీ సర్వే చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరం నుండి భూహక్కు భూరక్ష కార్యక్రమంపై రంపచోడవరం డివిజన్‌లోని రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాలకు చెందిన తహశీల్దార్లు, మండల, సచివాలయ సర్వేయర్లతో మంగళవారం పిఒ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏడు మండలాల్లో ఇప్పటివరకు ఎన్ని గ్రామాలలో, ఎన్ని ఎకరాలు రీ సర్వే చేసింది గ్రామాల వారిగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ నాటికి రీసర్వే పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో రీ సర్వేకు సంబంధించిన వివరాలు ముందుగా వీఆర్వో లాగిన్‌లో పొందుపరచాలని సూచించారు. సర్వే టీంలు ఉదయం 6, 7 గంటలకల్లా ఫీల్డ్‌లో ఉండాలన్నారు. ఈ సర్వే చేసిన రైతులకు సంబంధించిన భూములకు రైతులకు నోటీసులు ఇచ్చి అనంతరం ఒక సమావేశం ఏర్పాటు చేసి రైతులు సంతృప్తి పొందిన ఎడల పూర్తి వివరాలు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఏజెన్సీ ఏడు మండలాలలో ఇప్పటివరకు 253 గ్రామాలలో ఫీల్డ్ వర్క్ పూర్తయిందని తెలిపారు. రీ సర్వే ప్రారంభం కాని గ్రామాల భూములకు సర్వే చేసే ముందు రైతులకు తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి కె.దేవేంద్రుడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి భీమశంకర్, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మడకం సావిత్రి, డిప్యూటీ తహశీల్దారు కె.సుధాకర్ బాబు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి, సర్పంచ్, సిపిఎం నాయకులు

వైఎస్‌ఆర్ పోషణ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి–విఆర్.పురం
మండలంలోని రామవరం పంచాయతీ పరిధి సోపల్లి, సోములగూడెం రెండు అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు వైయస్సార్ పోషకాహార కిట్లను ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ కారం బుచ్చమ్మ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి మాట్లాడుతూ తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. కూరగాయలు, ఆకుకూరలు, పాలు వంటి బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. ప్రతి నెల గర్భిణుల ఇంటికి వెళ్లి హెల్త్ చెకప్ చేసి రావాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ముత్తమ్మ, రాజేశ్వరి, హెల్త్ వర్కర్లు రామలక్ష్మి, కారం అజ్జమ్మ, సిపిఎం నాయకులు కారం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

గంభూషియా చేప పిల్లల విడుదల

ప్రజాశక్తి – పాడేరు :పలు వ్యాధులకు కారణమైన దోమలు, వాటి లార్వాల నిర్మూలనకు చెరువులు, బావుల్లో గంభూషియా చేప పిల్లలను విడుదల చేసినట్లు అల్లూరి జిల్లా మలేరియా అధికారి పి. ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని మినుములూరు పిహెచ్‌సి పరిధిలోని మినుములూరు, చింతలవీధి, తుంపాడ గ్రామాల్లోని చెరువులు, బావుల్లో గంబూషియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఎంఒ పి.ప్రసాద్ మాట్లాడుతూ, గంబుసియా చేపలు నీటి నిలువ ఉన్న చెరువుల్లో, బావుల్లో పెంచడం వలన దోమ ఉత్పత్తి యొక్క లార్వదశను తన ఆహారంగా తీసుకొని దోమ జాతి పెరగకుండా నివారిస్తుందన్నారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ, దోమల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక చర్యలు ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. కన్సల్టెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, డెంగీ, మలేరియా ఇతర వ్యాధులకు ప్రభుత్వపరంగా అందిస్తున్న ఉచిత వైద్యసేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ధనుంజయ్, హెచ్‌వి వరలక్ష్మి,హెల్త్ అసిసెంట్లు నాగరాజు, లక్ష్మణ్, చలం, పడాల్ వెంకటరమణ ఎంపిహెచ్‌ఇఒ ప్రభాకర్, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

చేప పిల్లలను విడిచిపెడుతున్న వైద్యసిబ్బంది

ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

మండల పరిషత్తు సమావేశంలో ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి- విఆర్.పురం
అధికారులు ప్రజలకు జవాబుదారీగా పని చేయాలని ఎంపిపి కారం లక్ష్మి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. సభ్యులు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, వరద బాధితులకు సహాయం, టార్పాలిన్లు అందరికీ అందజేయాలని కోరారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్‌పిటిసి సభ్యులు వాళ్ల రంగారెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రత్నకుమారి, తహశీల్దారు ఎన్.శ్రీధర్, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజినీ, చిన్న మట్టపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ వెట్టి లక్ష్మి, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, ములకనపల్లి సర్పంచ్ సవల మారయ్య, పలువరు సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి, చిత్రంలో జెడ్‌పిటిసి, ఎంపిడిఒ, తహశీల్దారు

వర్షాల కోసం పూజలు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి
రాజవొమ్మంగి పంచాయతీ పరిధి శ్రీరామనగర్, విద్యుత్ నగర్ గ్రామాల్లో మహిళలు వర్షాలు కురవాలని కోరుతూ మంగళవారం పూజలు నిర్వహించారు. స్థానిక రామాలయం, నూకాలమ్మ గుడి వద్ద, గ్రామ శివారులో బిందెలతో తెచ్చిన నీళ్ల వారధి పోసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సొసైటీ ఉపాధ్యక్షులు నాగులపల్లి కుశరాజు, వినాయక యూత్ నాయకులు కొండేజు నూకరాజు, నారపురెడ్డి మంగమ్మ, బీరా అచ్చియ్యమ్మ, మిరియాల సింహాచలం, నాగులపల్లి అప్పలరాజు, మహిళలు పాల్గొన్నారు.

ఆశా సంస్థ ఆధ్వర్యాన మొక్కల పంపిణీ

ప్రజాశక్తి–మోతుగూడెం
చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పరిధిలోని పొల్లూరు, మల్లవరం, తడికవాగు, ఫోర్‌బాయ్, ఎంసిడి క్యాంప్, ఇంతలూరు వాగు, భూసుపాక గ్రామాలలో గిరిజనులకు ఆశా సంస్థ ఆధ్వర్యంలో గూంజ్ వారి సహకారంతో ఉసిరి, సీతాఫలం, మామిడి, నిమ్మ, వెదురు తదితర రకాల 460 మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశా సంస్థ కార్యదర్శి సయ్యద్ సుభాని మాట్లాడుతూ ఈ మొక్కలను జాగ్రత్తగా నాటి సంరక్షించాలని, వాటి ద్వారా వచ్చే ఫలసాయంతో లబ్ధి పొందాలని సూచించారు. పాఠశాలలో పిల్లలు సీతాఫలం, జామ పండ్ల మొక్కలను నాటి, వాటికి కంచే ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

గిరిజన మహిళకు మొక్క అందిస్తున్న ఆశా సంస్థ ప్రతినిధి

అసైన్డ్ ఆర్డినెన్స్‌తో దళిత, గిరిజనులకు నష్టం

భూస్వాములకు ప్రయోజనకరంగా 9/77 చట్టసవరణ
వామపక్ష పార్టీలు, గిరిజన, ప్రజాసంఘాల తీవ్ర వ్యతిరేకత
రద్దు చేసే వరకూ ఉద్యమించేందుకు సన్నద్ధం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ గవర్నర్ ద్వారా ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ వల్ల పేదలకు, దళితులకు, గిరిజనులకు నష్టం వాటిల్లనుందని ఆందోళన వ్యక్తమౌతోంది. పేదలకు భూపంపిణీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములను అక్రమంగా అనుభవిస్తున్న భూస్వాములకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ 9/77 అసైన్డ్ చట్టాన్ని సవరణ చేయడం దుర్మార్గం. ప్రభుత్వమే ఈ తరహా ఆర్డినెన్స్‌ను తీసుకురావడం సరికాదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తీరు చూస్తుంటే దళితులు, ఇతర పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను పెత్తందారులకు కట్టబెట్టడానికే 9/77 చట్టాన్ని సవరించారని అర్థమవుతోంది. పేదలు పొందిన అసైన్డ్ భూములను అభివృద్ధి చేసుకుని వారి జీవితాలు, పిల్లల భవిష్యత్ అభివృద్ధి చేసుకోవడానికి పెట్టుబడి, సాగునీటి, వసతి సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయాల్సింది పోయి భూములు అమ్ముకోవడాన్ని ప్రోత్సహించడం అభివృద్ధి నిరోధక చర్య. ఈ సవరణ ద్వారా ఇప్పటికే అన్యాక్రాంతమైన భూములను ఇలాంటి తప్పుడు పద్ధతుల పేరుతో రాజమార్గంలో కొట్టేయడానికి భూస్వాములకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఆర్డినెన్స్ రద్దు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం, సిపిఎం, సిపిఐ, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అసైన్డ్ భూములకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ఆర్డినెన్స్ వల్ల పాలకవర్గాల వద్ద ఉన్న ప్రభుత్వ భూములకు చట్టబద్ధం చేసుకుని కోట్ల రూపాయల సొమ్ము చేసుకుంటున్నారని విమర్శిస్తున్నారు. భూ కబ్జాదారులకు, పాలకవర్గాలకు, భూస్వాములకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని పేర్కొంటున్నారు. ఆగమేఘాలపై ఎవరి ప్రయోజనాల కోసం ఆర్డినెన్స్ తీసుకువచ్చారని ప్రశ్నిస్తున్నారు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని అంటున్నారు. దీన్ని రద్దు చేసే వరకు ఆదివాసి గిరిజన సంఘం, సిపిఎం, సిపిఐ సహా ఆందోళన, ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరిస్తున్నారు.

చట్ట సవరణ వల్ల ఎవరికి లాభం? ఎవరికి నష్టం?

ఉమ్మడి రాష్ట్రంలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఉద్యమ పోరాటాల ఫలితంగా లక్షల ఎకరాలు ప్రభుత్వం పేదలకు భూమి అసైన్ చేసింది. పెత్తందారులు, పలుకుబడి కలిగిన వారు దౌర్జన్యంగా పేదల నుంచి లాగేసుకుంటే భూమి తిరిగి పేదలకు చెందేలా 1977లో అప్పటి ప్రభుత్వం ఎపి అసైన్డ్ భూముల చట్టం పిఒటి (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్ ఫర్) 9/77 అసైన్డ్ చట్టం తెచ్చింది. ఫలితంగా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా అసైన్డ్ భూములు పొందిన పేదలకు వాటిపై సంపూర్ణ హక్కులు కల్పించినట్లు అయింది. ఈ చట్టం ప్రకారం భూమిలేని పేదలకు రెండున్నర ఎకరాలు మాగాణి, ఐదు ఎకరాల మెట్ట పొందవచ్చు. అసైన్డ్ భూములను పొందిన వారు, వారి వారసులు అనుభవించాలేగానీ, అమ్మకాలు, కొనుగోలు చేయరాదు. ఎవరైనా బలవంతంగా, దౌర్జన్యంగా అన్యాక్రాంతం చేసినా కొన్నా శిక్షార్హులు. పట్టాలు పొందిన వారు ఐచ్ఛికంగానైనా అమ్మకానికి వీల్లేదు. భూమిని కోల్పోయిన దళితులు తిరిగి తమ భూమికావాలని వారు గానీ, వారి వారసులు గానీ ప్రభుత్వాన్ని కోరితే తిరిగి అప్పగించాలి. అధికారులు ఈ పని చేయకపోతే చట్టారీత్యా శిక్షార్హులు. చివరికి కోర్టులు ద్వారా పేదలు తిరిగి భూమిని పొందవచ్చు.

అసైన్డ్ ఆర్డినెన్స్‌ఉపసంహరించుకోవాలి

భూమిలేని గ్రామీణ పేదలు, దళితుల అభ్యున్నతి, ఆత్మగౌరవం, జీవనోపాధి కోసం ఇచ్చిన అసైన్డ్ భూములను అమ్ముకోవచ్చంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ వెంటనే ఉపసంహరించుకోవాలి. అసైన్డ్ చట్ట సవరణపై అన్ని రాజకీయ, వ్యవసాయ కార్మిక, దళిత సంఘాలతో తొలుత చర్చించాలి. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూముల వివరాలను గ్రామ సచివాలయాల్లో బహిరంగపరచాలి. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కనీసం చర్చించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోంది.

పి.అప్పలనర్స
సిపిఎం జిల్లా కార్యదర్శి

భూస్వాములకు కట్టబెట్టడానికే చట్ట సవరణ

అసైన్డ్ భూములను కార్పొరేట్ కంపెనీలకు, రియల్టర్లకు, భూస్వాములకు కట్టబెట్టడానికే వైసిపి ప్రభుత్వం చట్ట సవరణ చేసి గవర్నర్ ద్వారా జూలై 31న ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ప్రభుత్వం తెచ్చిన సవరణ, అసైన్డ్ భూముల హక్కుదారుల కంటే అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్న భూస్వాములకు మేలు చేయడానికే ఉపయోగపడుతుంది. కార్మికులు, పేదలు, దళితులు పోరాట ఫలితంగా 9/77 అసైన్డ్ చట్టం వచ్చింది. అసైన్డ్ భూములను అక్రమంగా అనుభవిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

కిల్లో సురేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ఆదివాసి గిరిజన సంఘం

అసైన్డ్ చట్ట సవరణ దుర్మార్గం

9/77 అసైన్డ్ చట్టం సవరణ దుర్మార్గం. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్ట సవరణ వల్ల అక్రమంగా, దౌర్జన్యంగా అసైన్డ్ భూములు అనుభవిస్తున్న వారికే ప్రయోజనం. గతంలోనూ అసైన్డ్ చట్ట సవరణ వల్ల పేదల కంటే అనర్హులే ఎక్కువ లబ్ధి పొందారు. అనర్హుల చేతుల్లో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తిరిగి హక్కుదారులకు లేదా వారి వారసులకు ఇవ్వాలి. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి.

వి.ఉమామహేశ్వరరావు
సిఐటియు జిల్లా ప్రధాన

దళితులకు తీరని ద్రోహం

అసైన్డ్ చట్టం దళితుల భూములకు కవచం వంటిది. ఎవరైనా బలవంతంగా, దౌర్జన్యంగా దళితులకు ఇచ్చిన భూములను కొన్నా, అన్యాక్రాంతం చేసినా శిక్షార్హులు. భూమిని కోల్పోయిన దళితులు కోరితే తిరిగి అప్పగించాల్సిందే. అధికారులు ఈ పని చేయకపోతే చట్టారీత్యా శిక్ష అర్హులు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సింది పోయి, భూస్వాముల ఒత్తిడికి తలొగ్గి, పాలకవర్గాలు దళితులకు ద్రోహం చేస్తున్నాయి.

కూడా రాధాకృష్ణ
గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి

మానసిక ఆరోగ్యం అవసరం

ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్

ప్రజాశక్తి-విశాఖపట్నం : మానసిక ఆరోగ్యం కలిగి ఉండటం ద్వారా శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం సాధ్యపడుతుందని ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం ఎయు సైకాలజీ విభాగంలో నిర్వహించిన 'అడ్వాన్సెస్ ఇన్ కాగ్నిటివ్ సైన్సెస్ బెటర్ ఫ్యూచర్ ఫర్ ఏజింగ్ అండ్ న్యూరో డైవర్స్ పీపుల్ ' అంశంపై జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణమోహన్ మాట్లాడుతూ, నేటి సమాజంలో మానవ సంబంధాలలో మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. సంతోషంగా జీవించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. విదేశాలలో వృద్ధులు సైతం ఎవరిపైనా ఆధారపడకుండా సొంతంగా పనిచేయడం స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. సమ వయస్కుల నుంచి వస్తున్న ఒత్తిడి యువతలో ఆత్మహత్యలను ప్రేరేపిస్తోందని తెలిపారు. సహనంతో సమాధానం ఇవ్వడం అలవరచుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో సైకాలజీ కౌన్సెలర్ ఉండటం అవసరమన్నారు. బాల్యం, పెరిగిన విధానం, విలువల వ్యవస్థ, సామర్థ్యాలు, జ్ఞాపకశక్తి, సాఫ్ట్‌స్కిల్స్ వంటివి వ్యక్తి ప్రగతిని ఎంతగానో ప్రభావితం చేస్తాయని చెప్పారు. మానవ ప్రవర్తనను తెలుసుకోవడం ఎంతో సంక్లిష్టమైన అంశమన్నారు.

కెనడాలోని ఆరెంజ్ న్యూరోసైన్సెస్ సంస్థ సిఇఒ డాక్టర్ వినయ్ సింఘ్ మాట్లాడుతూ, మానవ మస్తిష్కంలో ఏమి జరుగుతుందో తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. సంయుక్తంగా పరిశోధనలు జరపాలని ఆహ్వానించారు. వయోభారాన్ని తగ్గించడం సాధ్యపడుతుందన్నారు. మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెవి.రామిరెడ్డి మాట్లాడుతూ, నిత్యం తమ ఆసుపత్రికి పదుల సంఖ్యలో చిన్నారులు వివిధ మానసిక సమస్యలతో వస్తున్నారని, వారికి అవసరమైన చికిత్సలను అందిస్తున్న విధానం గురించి వివరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ, సమస్యలకు మూలాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. అధునాతన పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించడానికి ఇటువంటి సదస్సులు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లా కేంద్రం పాడేరులోని పాత పాడేరు ఎంపిపి పాఠశాలను మండల విద్యాశాఖాధికారి రామచంద్రరావు మంగళవారం సందర్శించారు. పాఠశాలలో నాడునేడు నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తరగతి గది, మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని హెచ్ఎం సుజాతను ఆదేశించారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని, వర్క్ బుక్స్ ఎప్పటికప్పుడు కరెక్షన్ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. బోధనకు సంబంధించి పలు సూచనలు చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు గురునాథ్‌పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ

నేరాలు ఘోరాలు

ఐదెకరాల్లో గంజాయి తోటలు ధ్వంసం
- ముగ్గురు అరెస్ట్
- పోలీసుల ఆధ్వర్యాన కళాజాతా

ప్రజాశక్తి -యంత్రాంగం

జి.మాడుగుల: మండలంలోని నుర్మతి పంచాయతీ గాదిగుంట గ్రామశివారులో ఐదు ఎకరాల్లో సాగులో ఉన్న గంజాయి తోటలను మంగళవారం స్థానిక పోలీసులు ధ్వంసం చేశారు. ఆకస్మిక దాడులు నిర్వహించి గంజాయి మొక్కలను పీకేసి దగ్ధం చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ అందించిన వివరాలివి.

గాదిగుంట గ్రామశివారులో గంజాయి సాగు చేస్తున్నట్టు ముందస్తు సమాచారం మేరకు జి మాడుగుల పోలీసులు, నుర్మతీ విఆర్ఒ, అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు చేశారు. పోలీసులు రాకను గమనించిన గంజాయి సాగుచేస్తున్న ముగ్గురు వ్యక్తులు పారిపోయేందుకు యత్నించంగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. తర్వాత వారి సాగుచేస్తున్న 5 ఎకరాల్లో గంజాయి మొక్కలను గ్రామస్తులు సహాయంతో పీకేశారు. పెట్రోల్ పోసి నిప్పు అంటించి ధ్వంసం చేశారు. పట్టుబడిన నిందితులపై ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా గంజాయి సాగు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, గంజాయికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను పండించాలని హితవు పలికారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో అల్లూరి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో కళాజాతా ప్రదర్శన నిర్వహించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

21 కిలోలు పట్టివేత

చీడికాడ : గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.రామారావు తెలిపారు నిందితుల నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు చీడికాడ మండలం అప్పలరాజుపురం గ్రామ శివారులో సోమవారం సాయంత్రం 6 గంటలకు పోలీసులు తనిఖీలు చేస్తుండగా, ముగ్గురు వ్యక్తులు సంచులలో తరలిస్తున్న గంజాయితో పట్టుబడ్డారు. సత్యసాయి జిల్లాకు చెందిన శ్రీనివాసులు,ముత్యాలు, అల్లూరి జిల్లా పాడేరుకు చెందిన ధర్మరాజు అనే ముగ్గురు వ్యక్తుల నుంచి 21కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

ప్రియునితో కలిసి భర్త హత్య!
ప్రమాదంగా చిత్రీకరించేందుకు భార్య యత్నం
మృతుని బంధువుల ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు

ప్రజాశక్తి - గొలుగొండ : ప్రియుడితో కలిసి భర్తను హతమార్చి, బైక్ ప్రమాదంగా చిత్రీకరించిన భార్య ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దైవదర్శనానికి భర్తతో కలిసి వెళ్లి, తిరుగు ప్రయాణంలో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. సేకరించిన వివరాల ప్రకారం, గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామానికి చెందిన గొల్లు జానకికి, అదే గ్రామానికి చెందిన గుడివాడ వరహాలబాబుకు పదేళ్లక్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలఉన్నారు. ఇదిలా ఉండగా ఇదే మండలం పాతకేడిపేట గ్రామానికి చెందిన మరొక యువకుడితో జానకి అక్రమ సంబంధం నడుపుతున్నట్లుగా తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం తాండవ సమీపంలో అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లాలని భర్త వరహాలబాబుపై ఒత్తిడి తెచ్చిన జానకి, బైక్‌పై వెళ్లి దర్శనం అనంతరం తాండవ నుంచి జోగుంపేట వచ్చే రహదారి గుండా వస్తూ, ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. అయితే జరిగిన సంఘటనను ప్రమాదంగా నమ్మించేందుకు మృతుడి భార్య పలువురికి ఫోన్ చేసి వెంకట్రాపురం సమీపంలో తమకు బైక్ యాక్సిడెంట్ జరిగిందని, ఈ ప్రమాదంలో తన భర్త చనిపోయాడంటూ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. గొలుగొండ పోలీసులు కూడా తొలుత దీన్ని బైక్ ప్రమాదంగానే భావించారు. అయితే మృతుడి బంధువులు జరిగిన సంఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో సోమవారం రాత్రికి ఇది బైక్ ప్రమాదం కాదని, ప్రియుడితో కలిసి భార్యే భర్తను హత్య చేసినట్లుగా నిర్ధారణ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మృతుని భార్యను, ఆమె ప్రియుడిని పోలీసులు అదుపులో తీసుకొని విచారణ చేస్తున్నారు.

ఎర్రంశెట్టి శ్రీనివాసరావుకు పితృవియోగం

ప్రజాశక్తి - చింతూరు : వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సిపిఎం స్థానిక నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు తండ్రి ఎర్రంశెట్టి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో మృతిచెందారు. ఆయన నాటి పోరాటాల్లో పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు (ఫైల్)

సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం

వెంకటేశ్వరరావు మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. వెంకటేశ్వరరావు మృతి పట్ల సంతాపం తెలిపిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు సీతారామయ్య. పల్లపు వెంకట్. వి.రాజకుమార్. మొట్టుం రాజయ్య, ఐద్వా నాయకులు ముర్రం రంగమ్మ, పి.లక్ష్మణ్, కారం నగేష్, సవలం నారాయణ, పెద రాములు ఉన్నారు.

దిశ సెంటర్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్ దిశ వన్ స్టాప్ సెంటర్ (సఖి) ఉద్యోగులకు బకాయి ఉన్న పది నెలలు జీతాలను వెంటనే చెల్లించాలని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశానికి హాజరైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పరిశ్రమల, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లకు దిశా సెంటర్ ఉద్యోగులతో కలిసి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 సంవత్సరాల క్రితం వన్‌స్టాప్ సెంటర్ (సఖి)లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను నియమించారన్నారు. నాటి జీతాలనే నేటికీ ఇస్తుండటం శోచనీయమన్నారు. గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటి వరకూ పది నెలల జీతాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు సంవత్సరాలుగా వీరికి సక్రమంగా బడ్జెట్ విడుదల చేయడం లేదన్నారు. కనీసం విధులకు హాజరు కావడానికి రవాణా ఛార్జీలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వడ్డీలకు అప్పులు చేసుకొని ప్రతిరోజూ విధులకు హాజరవుతున్నారని తెలిపారు.

వాల్తేరు డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్‌లోని అలమండ-కోరుకొండ-విజయనగరం స్టేషన్ల మధ్య ఆటో సిగ్నలింగ్‌ను ప్రారంభించేందుకు నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా 12 రైళ్లను రద్దు చేశారు. 08546 విశాఖపట్నం - కోరాపుట్ ప్యాసింజర్ స్పెషల్, 08545 కోరాపుట్ - విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 08528 విశాఖపట్నం -రాయ్‌పూర్ ప్యాసింజర్ స్పెషల్, 08527 రాయ్‌పూర్ - విశాఖపట్నం - ప్యాసింజర్ స్పెషల్, 08532 విశాఖపట్నం - పలాస ప్యాసింజర్ స్పెషల్, 08531 పలాస - విశాఖపట్నం - ప్యాసింజర్ స్పెషల్, 08504 విశాఖపట్నం - రాయగడ ప్యాసింజర్ స్పెషల్, 08503 రాయగడ - విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 07468 విశాఖపట్నం - విజయనగరం మెము స్పెషల్, 07469 విజయనగరం - విశాఖపట్నం మెము స్పెషల్, 07470 విశాఖపట్నం - పలాస మెము స్పెషల్, 07471 పలాస - విశాఖపట్నం - మెము స్పెషల్ రైళ్లను ఈ నెల 24, 25 తేదీల్లో రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి ఒక ప్రకటన లో తెలిపారు.

అలాగే కొత్తవలస-కోరాపుట్ సెక్షన్ మీదుగా గోరాపూర్ - అరకు - శిమిలిగూడ స్టేషన్ల మధ్య డబ్లింగ్‌కు సంబంధించి నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా 18512 విశాఖపట్నం - కోరాపుట్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆగష్టు 21, 25, 28, సెప్టెంబర్ 1 తేదీల్లోనూ, 18511 కోరాపుట్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను ఆగష్టు 22, 26, 29, సెప్టెంబర్ 2 తేదీల్లోనూ, 08551 విశాఖపట్నం - కిరండూల్ రైలును ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 1 వరకు, 08552 కిరండూల్ - విశాఖపట్నం రైలును ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 2 వరకు రద్దు చేశారు.

871వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయొద్దంటూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 871వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పి.భాస్కరరావు, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.లోకేష్, ఎన్.కుమార్, ఎ.జగదీష్, బి.వెంకటేష్ పాల్గొన్నారు.

గ్లోబల్ మారిటైం సమ్మిట్ ఏర్పాట్లలో పోర్టు అధికారులు

రూ.34 వేల కోట్ల ఒప్పందాల దిశగా అడుగులు
తీర పరిశ్రమలపై దృష్టిసారిస్తున్న కేంద్రం
పూర్తిస్థాయిలో పిపిపి అమలుకు ప్రణాళిక
నేడు విశాఖ నగరంలో రోడ్ షో

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ పోర్టు ట్రస్ట్ (విపిఎ) ఈ ఏడాది అక్టోబర్‌లో 17 నుంచి 19 వరకూ జరుగనున్న గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ ఏర్పాట్లలో పూర్తిగా నిమగ్నమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడుల భాగస్వామ్యం కోసం కేంద్రంలోని బిజెపి సర్కారు తనదైన శైలిలో దేశంలోని మేజర్ పోర్టులను డైవర్ట్ చేస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ఏజెన్సీలతో వైజాగ్ పోర్టు ఆధ్వర్యాన రూ.34 వేల కోట్ల పెట్టుబడుల కోసం ఈ సమ్మిట్ సందర్భంగా ప్రతిపాదనలున్నాయి. ఇప్పటికే 26 బెర్తుల్లో 11 వరకూ పిపిపిలోకి వెళ్లిపోయాయి. తాజాగా సుమారు రూ.250 కోట్లతో పోర్టు ఆసుపత్రిని సైతం పిపిపికి ఇచ్చేయాలని పోర్టు ఉన్నతాధికారులు నిర్ణయించారు. కన్సల్టెంట్లతో చర్చలు, సంప్రదింపులు గడచిన కొద్దిరోజులుగా పోర్టు కేంద్రంగా నడుస్తున్నాయి. ఢిల్లీలో జరగబోయే మారిటైం సదస్సులో ప్రధానంగా ప్రైవేట్ పెట్టుబడులపైనే కేంద్రం దృష్టిసారించింది. తీర ప్రాంతంలో పలు పరిశ్రమల ఏర్పాటుకు ఈ ఢిల్లీ సదస్సు పోర్టులను ముగ్గులోకి దించనుంది. విపిటి ఇప్పటికే ఆ దిశలో ప్రయాణం చేస్తున్న విషయం తెలిసిందే. వంద శాతం ల్యాండ్‌లార్డ్ పోర్టు భావనకు ఇండియా మారిటైం సదస్సు అవకాశం కల్పించనుంది..

రోడ్ షోతో శ్రీకారం

కేంద్ర పోర్టులు నౌకాయాన జలరవాణా మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన గ్లోబల్ మారిటైం రోడ్ షోను విశాఖ నగరంలో వైజాగ్ పోర్టు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ రూ.34 వేల కోట్ల ఒప్పందాలను పోర్టు చేసుకుని ఒప్పందాలపై ఢిల్లీ సదస్సులో సంతకాలు చేయనుందని వెల్లడించారు. ఈ రోడ్‌షోలో కేంద్ర పోర్టులు, నౌకాయాన జలరవాణా మంత్రి శర్బానంద సోనోవాల్ తన వీడియో సందేశాన్ని అందించనున్నారని పేర్కొన్నారు. విశాఖలో జరిగే రోడ్‌షోలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులు, ఎపి మారిటైం, విశాఖపట్నం ఉన్నతాధికారులు, స్టీవ్‌డోర్స్, స్టేక్ హోల్డర్స్ పాల్గొనున్నారు.

ఘనంగా ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన 50వ ఆల్ ఇండియా ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ -2023 పోటీలు మంగళవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి హాజరయ్యారు. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఈ పోటీల ద్వారా ఎంతో మంది క్రీడాకారులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. రాజారెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద ఈవెంట్ ఇదని, గతంలో ఈ పోటీలలో మెరుగైన ఫలితాలు సాధించిన వారు అంతర్జాతీయ క్రీడల్లో అర్హత సాధించారని తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

బహుమతి అందజేస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

విజేతలు వీరే

పురుషుల సింగిల్స్ విభాగంలో పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్‌కు చెందిన ఆచంట శరత్, మహిళా సింగిల్స్ విభాగంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఆకుల శ్రీజ విజేతలుగా నిలవగా, పురుషుల డబుల్స్ విభాగంలో రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు చెందిన భానుజా రోహిత్, పాల్ ఆకాష్, మహిళల డబుల్స్ విభాగంలో రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్‌కు చెందిన ముఖర్జీ సుతీర్థ, బైస్య పోయిమంటిలు విజేతలుగా నిలిచారు.

మున్సిపల్ కార్మికుల బైకు ర్యాలీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమస్యలపై ఈ నెల 24న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్మికులు విశాఖ నగరంలో భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఆర్‌టిసి కాంప్లెక్స్, జివిఎంసి ప్రధాన కార్యాలయం, జగదాంబ జంక్షన్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, ఉపాధ్యక్షులు శీర రమణ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. యుజిడి, మలేరియా, ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. హెల్త్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ర్యాలీ అనంతరం ఆర్‌కె.బీచ్‌లో జల దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.నాయుడు, ఇ.ఆదినారాయణ, ఎం.ఈశ్వరరావు, పి.అప్పలరాజు, శ్రావణ్, శ్రీను, మహేశ్వరి, పైడమ్మ, విజయ, భాస్కరరావు పాల్గొన్నారు.



వైవి.సుబ్బారెడ్డితో గిరిజన ప్రాంత నేతలు

వైవి సుబ్బారెడ్డిని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డిని మంగళవారం రాత్రి పలువురు వైసిపి నేతలు కలిశారు. అరకు ఎంఎల్ఎ ఫాల్గుణ, ఇటీవలే ఎంఎల్‌సిగా ఎన్నికైన కుంభా రవిబాబు, మరికొంతమంది మహిళా నేతలు సుబ్బారెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

డివైఎఫ్ఐ జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 25న విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్ రాజు, కార్యదర్శి కె.సంతోష్ విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సుకు సంఘం జాతీయ అధ్యక్షులు, కేరళ ఎంపీ రహీం ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిరుద్యోగులకు స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీ నీటిమూటగానే మిగిలిపోయిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరిట రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. మరోపక్క కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను ఏళ్లు గడుస్తున్నా నింపడం లేదన్నారు. నేడు ప్రభుత్వ విధానాలే నిరుద్యోగ సమస్యను పెంచిపోషిస్తున్నాయని తెలిపారు. విద్యాలయాల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలతో నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు.

చిత్రకారుడు సూర్యనారాయణ మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చిత్రకారునిగా, రచయితగా, రేడియో డబ్బింగ్ ఆర్టిస్టుగా సేవలందిస్తున్న గొండేల సూర్యనారాయణ (72) రామ్‌నగర్‌లోని తన నివాసంలో గుండెపోటుతో కన్నుమూశారు. కోరమాండల్ ఫెర్టిలైజర్స్‌లో పనిచేస్తూ విభిన్న కళారంగాలకు ఆయన సేవలు అందించారు. సురేష్ ఆర్ట్స్ అధినేతగానూ, ది విశాఖ పెయింటింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షునిగానూ చిత్రకారుల సంక్షేమానికి కృషి చేశారు. నవలా రచయితగా ఆకాశవాణిలో నాటకాలు, పద్యాలు, సూక్తి ముత్తావళి, ఏక పాత్రాభినయం వంటివి అందించారు. జాషువా అవార్డు, డాక్టర్ సినారె స్మారక పురస్కారాలు పొందారు. ఆయనకు భార్య అరుణ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు వున్నారు. కళాకారులు, కుటుంబ సభ్యులు, అభిమానుల అశ్రు నయనాలతో మంగళ వారం మధ్యాహ్నం జ్ఞానాపురం హిందూ శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా దుర్గారావు, విశాఖ సకల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, సంపంగి సురేష్, చిత్రకారులు గొండేల బాలకృష్ణ పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణకు సహకారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చిన్నారులకు అత్యుత్తమ పోషణను పారాచూట్ అడ్వాన్స్‌డ్ వర్జిన్ కోకోనట్ ఆయిల్ అందించనుందని మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ అవస్తి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరతరాలుగా చక్కని సంరక్షణ, పోషణకు మారుపేరుగా ఉన్న పారాచూట్ అడ్వాన్స్‌డ్ ఇప్పుడు బేబీ శ్రేణిని సగర్వంగా ఆవిష్కరించిందన్నారు. ఏళ్ల తరబడి నమ్మకమైనదిగా ఉన్న పారాచూట్ ఇప్పుడు శిశువుల సంరక్షణను కూడా అందిస్తోందన్నారు. మసాజ్ ఆయిల్, పోషణతో కూడిన సబ్బు, షాంపూ, లోషన్, క్రీమ్, రిఫ్రెషింగ్ పౌడర్లు అను ఆరు ఉత్పత్తులు వీటిలో ఉన్నాయన్నారు. ఇవి శిశువుల సున్నితమైన చర్మానికి సరైన సంరక్షణను అందించడానికి దోహదపడతాయని తెలిపారు.